అన్నదాతపై బీమా భారం

- ఉచిత పంటల బీమాకు మంగళం పాడిన కూటమి ప్రభుత్వం
- బీమా ప్రీమియం రైతులే చెల్లించాలంటూ ఉత్తర్వులు
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పంటలకు ఉచిత బీమా


పాచలవలసలో సాగులో ఉన్న వరి పంట

దత్తిరాజేరు: అన్నదాతలు ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట ప్రకృతి విపత్తుల వల్ల దెబ్బతింటే ప్రభుత్వం వారికి అండగా ఉంటూ ఆదుకోవాలి. కానీ రాష్ట్రంలో కూట మి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా పని చేస్తోంది. రైతులకు అండగా ఉండడం మాట అటుంచితే, రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ వారి నడ్డి విరుస్తోంది. కూటమి ప్రభుత్వం నిర్ణయాలు రైతులపై పగసాధింపు చర్యల్లా ఉన్నాయని పలువురు రైతులు అంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. వర్షాలు, తుఫాన్‌లతో పంటకు నష్టం వాటిల్లిన ప్పుడు రైతులను ఆదుకునేందుకు దోహదపడుతుందనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019 ఖరీఫ్ సీజన్ నుంచే ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసింది. రైతులు సాగుచేస్తున్న పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేసి, సాగు విస్తీర్ణం అంతటికీ బీమా వర్తించేలా ప్రభుత్వమే రైతుల తరఫున ప్రీమియం చెల్లించేంది.రైతులపై ఒక్క రూపాయి కూడా భారం పడేది కాదు.బీమా ప్రీమియం చెల్లించేందుకు రైతులు ఆర్థిక ఇబ్బందులు పడాల్సిన అవసరం ఉండేది కాదు. పంటలకు నష్టం వాటిల్లితే ఠంఛన్‌గా పరిహా రం అందేది. గజపతినగరం నియోజకవర్గంలో 2021 ఖరీఫ్ సీజన్‌లో తుఫాన్ ప్రభావంతో పంటలు దెబ్బతినగా, 4,438 మంది రైతులకు రూ.2.21 కోట్లను వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిహారం అందించింది. 2022 ఖరీఫ్ సీజన్‌లో 8,133 మంది రైతులకు రూ.2.73 కోట్లు పరిహారం అందించారు.

రైతన్నల ఆవేదన

చంద్రబాబు ప్రభుత్వం ఉచిత పంటల బీమాను రద్దు చేయడంతో ప్రీమియం భారం రైతులపై పడుతోంది. రబీ సీజన్‌కు సంబంధించి పంట బీమా కోసం రైతులే ప్రీమియం సొమ్ము చెల్లించాలంటూ ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. గజపతినగరం నియోజరవవర్గంలో దత్తిరాజేరు, గజపతినగరం, బొండపల్లి, గంట్యాడ మండలాల్లో గతేడాది రబీ సీజన్‌లో 22 వేల హెక్టార్లలో అపరాలు, వేరుశనగ, మొక్కజొన్న, వరి సాగుచేశారు. ఈ ఏడాది కూడా అంతే విస్తీర్ణంలో పంటలను సాగు చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. పంటల బీమా ప్రీమియం చెల్లింపులు రైతులే చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరికాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా ప్రభుత్వమే రైతుల తరఫున సంబంధిత బీమా సంస్థలకు ప్రీమియం చెల్లించాలని కోరుతున్నారు. రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం కూడా ప్రభుత్వం ఇంకా అందించలేదని, అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్నామని, ఇప్పుడూ బీమా పథకాన్ని కూడా నీరుగార్చితే ఎలా అని ప్రశ్నిస్తున్నారు.

ప్రీమియం చెల్లింపులు ఇలా...

2024–25 రబీ సీజన్‌కు ప్రభుత్వం గుర్తించిన పంటలకు బీమా ప్రీమియం చెల్లింపుల వివరాలను ఇటీవల వెల్లడించింది. వేరు శనగకు ఎకరానికి రూ.460, మినప పంటకు రూ.265, పెసర పంటకు రూ.270, నువ్వు పంటకు రూ.160, మొక్కజొన్నకు రూ. 540, వరికి రూ.630 చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వరి పంటకు డిసెంబర్ 31లోగా, మిగతా పంటలకు డిసెంబర్ 15వ తేదీలోగా మీసేవ కేంద్రాలు, కామన్ సర్వీస్ సెంటర్లు, గ్రామసచివాలయాల్లో కానీ రైతులు ప్రీమియం చెల్లించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

అన్యాయం



గత ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమాను రద్దు చేయడం అన్యాయం. కూటమి ప్రభుత్వం చర్యలు రైతులను దెబ్బ తీసేలా ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా పథకం పేరుతో పెట్టుబడి సహాయం చెప్పిన సమయానికి అందించే వారు. ఉచిత పంటల బీమా పథకం పేరిట పంటలకు ప్రభుత్వమే బీమా చేయించేంది. కూటిమి ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకాన్ని పూర్తిగా నిలిపివేయగా, రైతు భరోసా పథకం పేరును అన్నదాత సుఖీభవగా మార్చారే తప్ప ఎవరికీ పెట్టుబడి సహాయం అందించలేదు. రైతులపై ప్రీమియం భారం పడకుండా రబీ పంటలకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలి. బీమా చేయించుకోకపోతే ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతిన్నప్పుడు ఇన్‌పుట్ సబ్సిడీ రాదు.

– ఆవుగడ్డి మురళీ, రైతు, చిన్నకాద గ్రామం, దత్తిరాజేరు మండలం

రైతులే ప్రీమియం చెల్లించాలి



పంటలకు బీమా వర్తించాలంటే రైతులు ప్రీమియం చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వ ఉత్తర్వులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. బీమా చేయించుకున్న రైతులకు సంబంధించిన పంటలు ప్రకృతి విపత్తులకు దెబ్బతింటే పరిహారం అందుతుంది. నిర్దేశించిన గడువులోగా రైతులు ప్రీమియం చెల్లించాలి.

– మహరాజన్, గజపతినగరం ఏడీఏ

సమంజసం కాదు



పంటల బీమాకు సంబంధించిన ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి. గతంలో అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకాన్ని కొనసాగించాలి. ప్రభుత్వం రైతులపై భారం మోపడం సమంజసం కాదు. పెట్టుబడికే డబ్బులు లేక ఇబ్బందులు పడుతుంటే బీమా చెల్లించాలని అనడం అన్యాయం. రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయం అందచేయాలి.

– చుక్క మురళి, రైతు, చుక్కపేట గ్రామం, దత్తిరాజేరు మండలం

క్లుప్తంగా

వైభవంగా సీతారాముల కల్యాణం


సీతారాముల కల్యాణం జరిపిస్తున్న పురోహితులు

లక్కవరపుకోట: కార్తీక బహుళ ఏకాదశి సందర్భంగా స్థానిక గవర వీధిలో మంగళవారం రాత్రి సీతారాముల కల్యాణమహోత్సవాన్ని స్థానికులు మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. పురోహితులు అక్కాజోష్యుల శ్రీహరి శర్మ పలువురు దంపతులతో పూజలు చేయించి, అనంతరం రాములోరి కల్యాణం జరిపించారు. సీతారాముల కల్యాణాన్ని వీక్షించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.కల్యాణం అనంతరం అన్నదానం చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం


తిమిడిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట: మండలంలోని తిమిడి, వెంకటరమణపేట గ్రామాల రైతు సేవా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే వారి ఖాతాల్లో డబ్బులు జమచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. మండల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపిక


విద్యార్థులు అభిషేక్, జయశ్రీతో కోచ్ సూర్య నూకరాజు

కొత్తవలస: మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యారని కరాటే కోచ్ కె.సూర్య నూకరాజు బుధవారం తెలిపారు. అనంతపురం జిల్లాలో ఈనెల 24, 25వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ కరాటే పోటీల్లో అండర్-17 బాలుర విభాగంలో దేశపాత్రునిపాలెం గ్రామానికి చెందిన మూనూరు అభిషేక్ స్వర్ణ పతకం, అండర్-14 బాలికల విభాగంలో వీరభద్రపురం గ్రామానికి చెందిన కె.జయశ్రీ రజత పతకం సాధించారని చెప్పారు. వీరిద్దరూ త్వరలో దేశ రాజధానిలో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

సోంపురం విద్యార్థుల ప్రతిభ


విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం, తదితరులు

వేపాడ: మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన రుద్రమదేవి గైడ్స్ యూనిట్ విద్యార్థులు జిల్లా కేంద్రంలో ఈ నెల 23 నుంచి 27 వరకు జరిగిన తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంపులో పాల్గొని ప్రతిభ కనబరిచారని హెచ్‌ఎం బీపీఏ రాజు, స్కౌట్ మాస్టర్ రమేష్‌నాయుడు తెలిపారు. ప్రాంతీయ శిక్షణ అండ్ కాంపింగ్ కేంద్రంలో ఎస్టిమేషన్, ప్రథమ చికిత్స, హైక్, తదితర అంశాలలో స్కౌటింగ్ నైపుణ్యాలు ప్రదర్శించారు. ఈ మేరకు విద్యార్థులను బుధవారం ప్రత్యేకంగా అభినందించారు.

పీఏసీఎస్ కార్యాలయం ప్రారంభం


గొట్లాంలో పీఏసీఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

బొండపల్లి: మండలంలోని గొట్లాం పీఏసీఎస్ నూతన అద్దె కార్యాలయాన్ని, అక్కడే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ కార్యదర్శి సత్యనారాయణ బుధవారం ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కోరాడ కృష్ణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు శిగడం శ్రీనివాసరావు, నాయకులు టి.రమణ, ఎస్.చిన్నంనాయుడు, వర్మరాజు, పి.కె.ఎం.రాజు పాల్గొన్నారు.

పరామర్శ


సర్పంచ్ పార్వతి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, నాయకులు

మెరకముడిదాం: మండలంలోని యాడిక గ్రామ సర్పంచ్ బొత్స పార్వతి భర్త సూర్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బుధవారం యాడిక గ్రామం వెళ్లి సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, అండగా ఉంటా మని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, చీపురుపల్లి నాయకుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, యాడిక మాజీ సర్పంచ్ బొత్స మోహన్‌రావు, గొల్లలవలస సర్పంచ్ బూరాడ గోవింద్, నాయకులు శనపతి లోకేష్, రాళ్లపూడి శ్రీనివాసరావు, పాచిపెంట బలరాం ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రంలో తనిఖీలు


ధాన్యంలో తేమశాతాన్ని పరీక్షించే యంత్రం పనితీరును పరిశీలిస్తున్న జేసీ సేతుమాధవన్

గుర్ల: మండలంలోని కెల్ల పీఏసీఎస్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో జేసీ సేతు మాధవన్ బుధవారం తనిఖీలు చేశా రు. తూనిక యంత్రాలు, ధాన్యంలో తేమశాతాన్ని పరీక్షించే యంత్రాలను పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని టన్నుల ధాన్యం సేక రించారని సిబ్బందిని ఆరాతీశారు. రైతుల వద్దకు వెళ్లి ధాన్యం కొనుగోలు చేయాలని, రెండు రోజుల్లో 50 టన్నుల ధాన్యం సేకరించాలని ఆదేశించారు. జిల్లాపై తుఫాన్ ప్రభావం ఉంటుందని, రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని, ఇప్పటికే కోతలు పూర్తి చేసిన వారు పంట చేనును సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, పొలాల్లో కుప్పలు పెట్టుకోవాలని సూచించారు. ఆయన వెంట వ్యవసాయశాఖ జేడీ వి.టి.రామారావు, తహసీల్దార్ ఆదిలక్ష్మి ఉన్నారు.

లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను సక్రమంగా నిర్వహించాలి


రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ జడ్జి రాజేష్‌కుమార్

చీపురుపల్లి: సబ్ జైళ్లలో రిమాండ్ ముద్దాయిల కోసం ఏర్పాటు చేసిన జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను సక్రమంగా నిర్వహించాలని జిల్లా అదనపు సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.వి.రాజేష్‌కుమార్ అన్నారు. జిల్లా న్యాయమూర్తి బి.సాయికల్యాణ్ చక్రవర్తి ఆదేశాల మేరకు పట్టణంలోని సబ్ జైల్‌ను బుధవారం ఆయన సందర్శించారు. సబ్ జైల్‌లో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను, వంటగది, భోజనశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఖైదీలతో మాట్లాడారు. ఆయన వెంట జూనియర్ సివిల్ జడ్జి వై.ప్రేమలత ఉన్నారు.

బాల్య వివాహ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఆడపిల్లలకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతే పెళ్లి చేయాలని కొత్తవలస సివిల్ కోర్టు న్యాయమూర్తి డాక్టర్ సముద్రాల విజయచంద్ర, డీఈఓ మాణిక్యాల నాయుడు, గుర్ల, చీపురుపల్లి, గంట్యాడ, వేపాడ, ఎల్.కోట మండలాల అధికారులు సూచించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో బుధవారం అవగాహన సదస్సులు, మండల కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించారు. బాల్య వివాహాల నిర్మూలకు కృషి చేస్తామని అధికారులు, ఐసీడీఎస్, సచివాలయాల సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, డ్వాక్రా సంఘాల సభ్యులు ప్రతిజ్ఞ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


కొత్తవలస: కొత్తవలస హైస్కూల్‌లో అవగాహన కల్పిస్తున్న జడ్జి డాక్టర్ సముద్రాల విజయచంద్ర


వేపాడ: బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు, చట్టాలపై బక్కునాయుడుపేట గురుకుల బాలికల పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ దేవి


వేపాడ: మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు


గుర్ల: గుర్లలో ర్యాలీ చేస్తున్న అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు


లక్కవరపుకోట: ఎల్.కోట హైస్కూల్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఈఓ మాణిక్యాలనాయుడు


గంట్యాడ: కేజీబీవీలో విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సిడిపిఓ ఉమాభారతి, ఉపాధ్యాయినులు


చీపురుపల్లి: ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, వెలుగు సిబ్బంది


చీపురుపల్లి: చీపురుపల్లిలో ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్, కోర్టు సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు


గంట్యాడ: గంట్యాడలో ర్యాలీ చేస్తున్న అధికారులు, డ్వాక్రా సంఘాల సభ్యులు

చోరీ నిందితుడి అరెస్టు

వేపాడ: కృష్ణారాయుడుపేటలోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితుడిని బుధవారం అరెస్టు చేశామని వల్లంపూడి ఎస్‌ఐ బి.దేవి తెలిపారు. ఈ నెల 24 తేదీ అర్ధరాత్రి గ్రామానికి చెందిన ఈ.హేమంతకుమార్ ఇంట్లో చోరీ జరగడంతో ఆయన వల్లంపూడి పోలీసులకు 25న ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా చోరీకి పాల్పడిన నిందితుడిని నిర్ధారించి అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

గిరిజనులకు రాయితీపై పనిముట్లు..

శృంగవరపుకోట: ఆర్‌ఓఎఫ్‌ఆర్ హక్కు పత్రాలు కలిగిన గిరిజనులకు రాయితీపై పనిముట్లు అందజేయాలని ఆదివాసీ గిరిజన సంఘ సభ్యులు కోరారు. మండల కేంద్రంలో పలువురు గిరిజనులతో కలిసి ఆర్‌ఓఎఫ్‌ఆర్ హక్కు పత్రాలను బుధవారం విలేకరులకు చూపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులైన గిరిజన రైతులకు పైపులు, స్ప్రింక్లర్లు, మినీ ట్రాక్టర్లు, టార్పాలిన్లు గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ఉచితంగా ఇప్పించాలని కోరారు. ఈ మేరకు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించనున్నట్లు చెప్పారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు


చీపురుపల్లి: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ఆవరణలోని కళాశాలల బాలికల వసతి గృహంలో మానవీయత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బి.వి.గోవిందరాజులు నగదు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయుడు డోల నాగరాజు, మీసాల లక్ష్మణరావు, వార్డెన్ యశోధ పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం


ర్యాలీ నిర్వహిస్తున్న ఆయుష్ వైద్యాధికారి సునీత, విద్యార్థులు

బొండపల్లి: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'దేశ్ కా ప్రకృతి పరీక్షణ్ అభియాన్' కార్యక్రమాన్ని ప్రారంభించారని గొట్లాం ఆయుష్ ఆస్పత్రి వైద్యాధికారి బి.సునీత అన్నారు. గొట్లాం గ్రామంలో విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయుష్ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి సూచించారు. ఆయుష్ కేంద్రం వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి


ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

లక్కవరపుకోట: గ్రీన్‌అంబాసిడర్లు, పంచాయతీల పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే అందజేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గ్రీన్ అంబాసిడర్లు,కార్మికులతో కలిసి బుధవారం నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకులు గాడి అప్పారావు, తరిణి వెంకటరమణ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని కోరారు. కనీసం వేతనం రూ. 26 వేలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓ ఎస్.అప్పారావుకు వినతిపత్రం అందజేశారు.

రైతులకు ఇబ్బందులు తలెత్తకూడదు


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్, చిత్రంలో ఎంపీపీ సింహాద్రిఅప్పలనాయుడు, జెడ్పీటీసీ రాజేశ్వరి

దత్తిరాజేరు: ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించుకునే రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమలు,సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. పోరలి రైతు సేవా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతు లు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సాగునీటి కాలువలపై దృష్టిపెట్టండి

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. గత ప్రభుత్వంలో అప్ప టి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గజపతినగరం నియోజక వర్గానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని, అనేక అభివృద్ధి పనులు చేయ డంతో పాటు పార్టీలకతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలు అందించా రని, మీరు కూడా పార్టీలకతీతంగా ప్రజలకు మంచి చేయాలని కోరారు. ఉత్తరాంధ్ర సుజల ప్రవంతి పథకం ద్వారా దత్తిరాజేరు మండలానికి సాగు నీరు తీసుకువచ్చేలా కృషి చేయాలన్నారు. తోటపల్లి పిల్లకాలువ డిజైన్ మార్చి చౌదంతివలస మీదుగా ఒక కాలువ, టి.భూర్జవలస మీదుగా ఒక కాలువ తవ్విస్తే రెండు పంటల సాగుకు నీరందుతుందని, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించాలని కోరారు. మంత్రి స్పందిస్తూ ఈ అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతానని చెప్పారు.స్థానిక సర్పంచ్ మిత్తిరెడ్డి ధనలక్ష్మి, మాజీ సర్పంచ్ మిత్తిరెడ్డి ఈశ్వరరావు, వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, టీడీపీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, ఏడీఏ మహరాజన్, ఏఓ అనురాధ, పీఏసీఎస్ కార్యదర్శి బలరాం పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి

- డిప్యూటీ డీఈఓ కేవీ రమణ


గాతాడ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులతో రివ్యూ నిర్వహిస్తున్న బృంద సభ్యులు

మెరకముడిదాం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరుచాలని డిప్యూటీ డీఈఓ కేవీ రమణ అన్నారు. మండలంలోని బుధరాయవలస జెడ్పీ పాఠశాల, మెరకముడిదాం కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయం, గాతాడ ప్రాథమిక పాఠశాలలను జిల్లా అకడమిక్ మానటరింగ్ టీమ్ బుధవారం సందర్శించింది. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అలాగే ఆయా పాఠశాలల ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. అనంతరం డిప్యూటీ డీఈఓ కేవీ రమణ మాట్లాడుతూ.. డిసెంబరు 4వ తేదీన ఎన్ఏఎస్ సర్వే, పరాహ్ రాష్ట్రీయ సర్వేక్షన్ కార్యక్రమాలను ఎంపిక చేయబడిన పాఠశాలల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే డిసెంబర్ 7న మెగా పేరెంట్స్‌డే కార్యక్రమాన్ని అన్ని పాఠశాలల్లో నిర్వహించనున్నామన్నారు. డైట్ కళాశాలలో ఈనెల 27, 28, 29 తేదీలలో కళా ఉత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమాల్లో టీమ్ సభ్యులు కె.రామారావు, సీహెచ్.జగన్‌మోహన్, ఎల్.రామకృష్ణ, ఎం.చంద్రశేఖర్, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

పురుగు ఆశించిన వరికుప్ప కాల్చివేత

- పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు


కాల్చేసిన వరిపంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు

గంట్యాడ: ఆరుగాలం కష్టించి పండించిన పంట పురుగు రూపంలో నేలపాలు కావడంతో తీవ్ర ఆవేదనకు గురైన రైతు పాడైన వరి దిబ్బను కాల్చేశాడు. దీనికి సంబంధించిన వివరాల్లోకి వెళితే గంట్యాడ మండలంలోని బుడతనాపల్లి గ్రామానికి చెందిన చల్లరాము ఏడు ఎకరాల పొలం కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. కోత దశలో రెల్ల రాల్చు పురుగు మూలాన వరి పంట తీవ్రంగా దెబ్బతింది. దీన్ని తట్టుకోలేకపోయిన రైతు రెండు వరి దిబ్బలను కాల్చేశాడు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు బుధవారం రైతు రాము కాల్చేసిన వరి పంటను పరిశీలించారు. దెబ్బతిన్న మిగతా వరి దిబ్బ(కుప్ప) లను పరి శీలించారు. సమస్య ఉంటే తన దృష్టికిగాని మండల వ్యవసాయ అధికారి దృష్టికి గానీ తీసుకు రావాల్సిందని రైతుకు సూచించారు. జిల్లాలో రెల్ల రాల్చు పురుగు వల్ల అధిక నష్టం వాటిల్లిన రైతుల వివరాలు సేకరించాలని వీఏఏలకు సూచించినట్లు జిల్లా వ్యవసాయాధికారి ఈ సందర్భంగా తెలిపారు. రైతులు రెల్ల రాల్చు పురుగు ఆశించిన పంటకు క్లోరిపైరిపాస్ మందు పిచికారీ చేయాలని సూచించారు. పురుగు మందు పిచికారీ చేసిన చోట పంటనష్టం తీవ్రత తగ్గిందని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఏ నాగభూషణరావు, ఏఓ శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానయాత్ర

గుర్ల: మండలంలోని వల్లాపురం హైస్కూల్ నుంచి 70 మంది విద్యార్థులు బుధవారం విజ్ఞాన యాత్రకు వెళ్లారని హెచ్‌ఎం అప్పారావు తెలిపారు. నెల్లిమర్ల మండలంలోని సతివాడ ఏపీజీవీబీని, పీహెచ్‌సీని సందర్శించారు. విద్యార్థులకు బ్యాంకు సేవలపై ఏపీజీవీబీ సిబ్బంది అవగాహన కల్పించారు. పీహెచ్‌సీలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, వైద్యపరికరాల పనితీరును విద్యార్థులకు వైద్యసిబ్బంది వివరించారు. ఉపాధ్యాయులు చంద్రశేఖర్, మంగమణి పాల్గొన్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోండి


ఖాసాపేటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ స్వాతికుమారి

లక్కవరపుకోట: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని రైతులు వరి కోతలు, నూర్పులను ఈనెల 30వ తేదీ వరకు వాయిదా వేసుకోవాలని ఏఓ స్వాతికుమారి సూచించారు. మండలంలోని ఖాసాపేట,తలారి గ్రామంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి కోతలు పూర్తి చేసిన వారు చేనును పొలాల్లోనే చిన్న చిన్న కుప్పలుగా పెట్టుకోవాలని చెప్పారు. వరిపంటను కోత కోసే ముందు రెల్ల రాల్చు పురుగు ఆశిస్తోందని, వరి కంకులను ఈ పురుగు కొరికేయడం వల్ల ధాన్యం పొలంలో రాలిపోతాయని వివరించారు. ఈ పురుగు ఉదయం పూట వరిదిబ్బల మొదళ్లలో దాక్కొని రాత్రిపూట కంకుల మీదకు వచ్చి వరి రెక్కలను కత్తిరించేస్తుందని, నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.